క్లుప్తంగా

ఏపీజీఈఏ క్యాలెండర్ ఆవిష్కరణ

మదనపల్లె సిటీ: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఏపీ ప్రభుత్వ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆర్డీవో ఎం.ఎస్.మురళి ఆవిష్కరించారు. ఉద్యోగులు అందరూ కలిసి మెలిసి పని చేయాలని ఆర్డీవో తెలిపారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, ప్రెసిడెంట్ శివరామ్‌ప్రసాద్, కార్యదర్శి కళ్యాణి, కోశాధికారి శేషయ్య, మల్లికార్జున, చలపతి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాడు - నేడు పనులు వేగవంతం చేయండి

వాల్మీకిపురం: స్థానిక కొత్తపేటవీధిలోని ఎంపిపిఎస్ స్పెషల్ పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని మదనపల్లి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కృష్ణప్ప అన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాలను ఆయన తనిఖీ చేసి నాడు– నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన బడి– నాడు – నేడు ఫేస్ 2 పనులు నాణ్యతగా ఉండాలని సూచించారు. అనంతరం పాఠశాలలో జరిగుతున్న పరీక్షను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటరత్నం, హెచ్‌ఎం పద్మావతి పాల్గొన్నారు.

నరసింహారెడ్డి మృతికి సంతాపం

గుర్రంకొండ: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ధనుంజయరెడ్డి మండలంలోని తరిగొండలో ఆయన సమీప బంధువు అంత్యక్రియలకు హాజరై సంతాపం తెలియజేశారు. రెడ్డివారిపల్లెకు చెందిన టి. నరసింహారెడ్డి(75) అనారోగ్యంతో చెన్నైలో మృతి చెందాడు. స్వగ్రామమైన రెడ్డివారిపల్లెలో శుక్రవారం ఆయన మృతదేహానికి వారి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కేవీపల్లె : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి నిందితున్ని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. వివరాలిలావున్నాయి. శుక్రవారం మండలంలోని పింఛా నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా యర్రావారిపాళెంకు చెందిన మద్దెల ప్రణీత్ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా గుర్తించి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ అద్దె గదులకు టెండర్ల ఆహ్వానం

వాల్మీకిపురం: వాల్మీకిపురం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆర్టీసీ గదులకు వేలం నిర్వహిస్తున్నట్లు మదనపల్లి డిపో–2 మేనేజర్ నిరంజన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్‌లోని క్యాంటిన్, స్టాల్స్, షాపులు, ఓపెన్ స్పేస్‌లలో వ్యాపారాలకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. టెండర్ ఫారాలు పీలేరు, వాల్మీకిపురం, రాయచోటి, కలికిరి బస్టాండ్‌లల్లో ఉన్నాయని, టెండరు ఫారంను ఈనెల 20వ తేదిలోపు, ధరావత్తు చెల్లించి, జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో టెండర్ బాక్స్‌లో వేయాలని సూచించారు.

జగనన్న పాలవెల్లువపై అవగాహన

పెద్దమండ్యం: జగనన్న పాల వెల్లువ కార్యక్రమంపై వలంటీర్లు, సంఘమిత్రలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వెలిగల్లు, శిద్దవరం గ్రామ సచివాలయాలలో ఎంపీడీఓ శ్రీధర్ రావు, వెటర్నరీ డాక్టర్ విక్రమ్‌రెడ్డిలు జగనన్న పాలవెల్లువ కార్యక్రమం గురించి వివరించారు. వలంటీర్లు తమ పరిధిలో ఉన్న కుటుంబాలలో పాడి ఆవులు ఉన్నవారిని గుర్తించి వారి వివరాలు నమోదు చేయాలన్నారు. పాడి రైతులకు గిట్టుబాటు ధరకల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మండలంలోని 54 పల్లెల్లో జగనన్న పాలవెల్లువ సేకరణ కేంద్రాలు గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపిఎం మధుబాబు, ఏపీవో మురళి, సర్పంచ్‌లు విజయకుమారి, సి సరస్వతి, వలంటీర్లు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు వితరణ

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్టవద్ద నున్న వెలుగు ప్రత్యేక పాఠశాలకు శుక్రవారం ఆర్టీసీ చిత్తూరు రీజనల్ మేనేజర్ జితేంద్రనాథ్ రెడ్డి నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వెలుగు పాఠశాల నిర్వాహకులు దివ్యాంగులకు చేస్తున్న సేవలను కొనియాడారు. గతంలో రెండు సార్లు పాఠశాలను సందర్శించినట్లు తెలిపారు. దివ్యాంగులకు సేవ చేయాలన్న ఉద్దేశంతో తన వంతు సహాయం చేసినట్లు తెలిపారు.

జోయాలుక్కాస్ జ్యువెలరీ ఎగ్జిబిషన్

మదనపల్లె : పట్టణంలో జోయాలుక్కాస్ జ్యువెలరీ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నారు. పుంగనూరురోడ్డులోని ఎస్‌జేఆర్ కల్యాణ మండలంలో శనివారం నుంచి సోమవారం వరకు జ్యువెలరీ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల కోసం అత్యాధునిక, సంప్రదాయ, సమకాలీన, ఇతర సూక్ష్మంగా రూపొందించిన డిజైన్లు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

–ఎమ్మెల్యే నవాజ్‌బాషా


రామసముద్రంలో నూతన పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

రామసముద్రం: పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో కొత్తగా మంజూరైన పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘపాదయాత్రలో చెప్పినట్లు నవరత్నాల పథకాలు ప్రకటించి అమలు చేస్తున్నారన్నారు. అధికారంలోకి రాగానే అంచలంచెలుగా ఏడాదికి రూ.250లు చొప్పున పెంచుకుంటు పోతూ రూ.3 వేలకు పింఛన్ పెంచడం జరుగుతుందన్నారు. ఇచ్చిన మాట కోసం మాట తప్పకుండ అవ్వ, తాతల ముఖాలలో చిరునవ్వులు చూసే విధంగా ఈఏడాది రూ.2750 లకు పెంచడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో ఎవరైనా మరణిస్తే గాని పెన్షన్ మంజూరైయ్యేది కాదని, అది కూడ జన్మభూమి కమిటి సభ్యులచే వాళ్ల పార్టీ వారికే ఇచ్చేవారన్నారు. మండలంలో ప్రస్తుతం 156 కొత్తపెన్షన్లు మంజూరు అయ్యాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి , నాడు–నేడు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీలు రమణారెడ్డి, గంగాధర్ నాయుడు, సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, కన్వీనర్ భాస్కర్‌గౌడ్, గెవన్న, రాధా, నంద, ఆనంద, కృష్ణమూర్తి, నరసింహులు, భాస్కర్, శివ, తిమ్మయ్య, సర్పంచ్‌లు , ఎంపీటీసీలు, అధికారులు, నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు మారు పేరు జగన్

మదనపల్లె: విశ్వసనీయత కలిగిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని 27వ వార్డు దొంతివీధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కౌన్సిలర్ కరీముల్లా ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు గజమాలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి గత మూడన్నర సంవత్సరం కాలంగా ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సకాలంలో అందిస్తున్నారా? లేదా ? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలకు ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తూ ఆదర్శపాలనకు నాంది పలికారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి నెలా వలంటీర్ల ద్వారా ఇంటివద్దకే ఫించన్ సొమ్ము, రేషన్ సరుకులు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వసీం, ఈశ్వర్‌నాయక్, శ్రీనివాసులు, కో– ఆప్షన్ మెంబర్ శారదారెడ్డి, వైస్ ఎంపీపీలు వెంకటరమణ, నందినితాజ్, సర్పంచు శరత్‌రెడ్డి, నాయకులు మెట్రోబాబ్‌జాన్, గుండ్లూరి రఫీ, ఇర్ఫాన్‌ఖాన్, చంద్రశేఖర్‌నాయుడు, బబ్లూ, రిజ్వాన్, రహీం, ఎంబీఎస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన

– ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి


మదుమూరులో ప్రజల కష్టాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

పెద్దతిప్పసముద్రం: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడిత్త పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మండలంలోని మదుమూరు, శ్రీనివాసరాయునిపల్లి, అములొర్పల్లి,పులికల్లు గ్రామాల్లో పర్యటించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హులైన వారు వివిధ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. ప్రజలకు ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సీఎం ప్రజల కోసం, వారి సంక్షేమం కోసం ఎంతో వ్యయ ప్రయాసాలను ఓర్చి పథకాలు అందిస్తున్న విధానాన్ని లబ్దిదారులకు క్షుణంగా వివరించాలని సచివాలయం సిబ్బందికి సూచించారు. జగనన్న పాలనలో అర్హతే ప్రామాణికంగా అవ్వా, తాతలు హాయిగా ఇంటి వద్దే పింఛన్ అందుకుంటూ సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం జగన్‌కే సాధ్యమన్నారు. ప్రజలంతా వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, కన్వీనర్ సుబ్బరాం, సర్పంచ్‌లు నాగరత్నమ్మ, గిరీష్, ఎంపీటీసీలు పద్మావతి, వెంకట్రమణమ్మ, నాయకులు కొండా సిద్దార్థ, కేవీ రమణ, భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులురెడ్డి, ఆనందరెడ్డి, ఉత్తన్న, సోము శేఖర్‌రెడ్డి,రేణుకా రెడ్డి, దొరిగుండ్ల శంకర్‌రెడ్డి, ఆదిరెడ్డి, రాజ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.50 కోట్ల పనులకు భూమి పూజ

మండలంలోని పులికల్లు జెడ్పీ హైస్కూల్‌లో నాడు–నేడు రెండవ విడతలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం మంజూరైన రూ.1.50 కోట్ల పనులకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి భూమి పూజ చేసారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు.

నేడు రంగసముద్రంలో

రంగసముద్రం పంచాయతీలో శనివారం గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు,అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన సూచించారు.

సీబీఎస్‌ఈ సిలబస్‌పై సైనిక పాఠశాలలో శిక్షణ


మాట్లాడుతున్న డీవైఈఓ క్రిష్ణప్ప

కలికిరి: ప్రభుత్వం రెషిడెన్షియల్ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్‌ను ప్రవేశ పెట్టనున్న సందర్భంగా మదనపల్లి డివిజన్ స్థాయి కోర్సు డైరెక్టరు డీవైఈఓ క్రిష్ణప్ప ఆధ్వర్యంలో సైనిక పాఠశాలలో రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లు సుశీల, ఏఆర్ మంజుల, జే.సురేష్‌లు సీబీఎస్‌ఈ సిలబస్‌పై శిక్షణనిచ్చారు. మదనపల్లి డివిజన్ పరిధిలోని కేజీబీవీ, రెషిడెన్షియల్ పాఠశాలల నుంచి 30 మంది ప్రధానోపాధ్యాయులు, 31 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందారు. సీబీఎస్‌ఈ సిలబస్‌పై ఉపాధ్యాయులకు ఎటువంటి సందేహాలు కలిగినా పాఠశాల ఉపాధ్యాయులు సహకరించేలా చర్యలు తీసుకున్నట్లు సైనిక పాఠశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ చరణ్‌జిత్ సింగ్ పరదేశి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ రంగనాధ రెడ్డి, సీఆర్‌పీలు సురేష్, భాస్కర, రియాజ్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు

–సీఐ శివాంజనేయులు

బి.కొత్తకోట: శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు రూరల్ సీఐ శివాంజనేయులు చెప్పారు. అలాగే నేరాలు జరిగే ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో నిఘా విస్తృతం చేశామని చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మదనపల్లె రూరల్ స్టేషన్ పరిధిలో ఇటీవల తల, మొండం వేరు చేసి చంపిన ఘటనతో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారని చెప్పారు. జన సంచారం లేని, ముళ్లపొదలు నిండిన, తోపులు, మద్యం సేవించడానికి, జూదాలకు నిలయంగా మారిన ప్రాంతాలను గుర్తించి వాటిపై చర్యలు చేపట్టామన్నారు. బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో 11, నిమ్మనపల్లెలో 3, రామసముద్రంలో 9, ముదివేడు పరిధిలో 4 ప్రాంతాలను గుర్తించామని చెప్పారు. ఈ ప్రాంతాల్లోని పొదలను తొలగిస్తున్నామన్నారు. ఈ ప్రాంతాలకు ఎవరూ రాకుండా చూస్తున్నామని, నిఘా కూడా పెట్టామని తెలిపారు.

దర్గా, మసీదుల అభివృద్ధికి చర్యలు

నిమ్మనపల్లె: దర్గా, మసీదుల అభివృద్ధికి వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్ఏ కరీముల్లా అన్నారు. శుక్రవారం మండలంలోని ముష్టూరు మసీదులో స్థానిక ముస్లింలు ఆయనను సన్మానించారు. అనంతరం నిమ్మనపల్లె సయ్యద్‌షావల్లి దర్గా కట్టను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 14 మసీదులు ఉండగా ఐదు మసీదుల్లోని ముతవల్లిలు, మౌజాన్లకు మాత్రమే ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం అందుతోందని, మిగతా వారికి అందించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. నిమ్మనపల్లె దర్గా కట్ట అభివృద్ధికి మంత్రి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా సహకారంతో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో హోటల్ రఫి, ఖాదర్‌బాషా, నూర్‌మొహిద్దీన్‌ఖాన్, అంజాద్, ముఖాసిద్దిక్ అలీఖాన్, మస్తాన్, ఖాదర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 20 లక్షలతో అభివృద్ధి పనులు


సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న నాయకులు

పీలేరు రూరల్ : మండలంలోని వేపులబైలు పంచాయతీ వరంపాటివారిపల్లెలో రూ. 20 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు సర్పంచ్ చెంగల్‌రాయుడు తెలిపారు. శుక్రవారం వరంపాటివారిపల్లె, మొటుకుపల్లె, జంగంపల్లె, కంచంవారిపల్లెలో సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో రూ. 20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణ పనులు మంజూరైనట్లు తెలిపారు. ఉప సర్పంచ్ పవన్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జ్ఞానశేఖర్, నాయకులు, భవనం వెంకటరమణారెడ్డి, వి.పి. రమేష్‌రెడ్డి, సూరి, శివ, నరసింహులు పాల్గొన్నారు.

అవగాహనతో రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట

కురబలకోట: రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన ఉంటే రోడ్డు ప్రమాదాలను నిలువరించవచ్చని మదనపల్లె డీఎస్పీ కేశప్ప అన్నారు. అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రోడ్డు భద్రతపై శుక్రవారం జరిగిన అవగాహనలో ఆయన మాట్లాడుతూ ఇంటి నుండి బయలుదేరిన వారు క్షేమంగా ఇంటికి చేరుతారన్న నమ్మకం లేని పరిస్థితిలు ఏర్పడ్డాయన్నారు. రోడ్డుపైకి వచ్చేటప్పుడు డ్రైవింగ్‌పై అవగాహన కల్గి ఉండాలన్నారు. లేదంటే బాధిత కుటుంబాలకు తీరని లోటు ఏర్పడుతుందన్నారు. చిన్నపొరపాట్లు పెద్ద పరిణామాలకు దారితీస్తుందన్నారు. అప్రమత్తంగా ఉండి డ్రైవింగ్ చేయాలన్నారు. పగటి పూట కన్నా రాత్రి పూట డ్రైవింగ్ చేసేటప్పుడు మరింత జాగ్రత్త అవసరమన్నారు. ఎస్ఐ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

గుర్రంకొండ: మండల ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ సద్దల ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో మండలశాఖ కన్వీనర్‌గా గాలివీటి రెడ్డి ఆంజినేయులు, కోకన్వీనర్‌గా కొండవీటి రమణయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. వారు మాట్లాడుతూ మాదిగ జాతి అభివృద్ధికి, వర్గీకరణకు చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇనుకోటి ప్రసాద్, నాయకులు సుబ్రమణ్యం, రవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

యువత మంచి మార్గాన్ని ఎంచుకోవాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ మల్లిక

ములకలచెరువు: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి మంచి మార్గాన్ని ఎంచుకోవాలని ఎస్‌ఈబీ సీఐ మల్లిక అన్నారు. శుక్రవారం ములకలచెరువు ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులతో మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపైన అవగాహన కార్యక్రమం కల్పించారు. మాదక ద్రవ్యాలు అలవాటు జీవితానికే ప్రమాదమని వివరించారు. ఈ వ్యసనంతో యువత జీవితాలు నాశనమవుతున్నట్లు చెప్పారు. గ్రామాల్లో మాదక ద్రవ్యాలు విక్రయాలు ఉంటే తమకు సమాచారం అందించాలని సీఐ కోరారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనత దూరం

తంబళ్లపల్లె: కిషోర బాలికలు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత దూరమవుతుందని ఎంపీహెచ్‌ఈఓ రమణ తెలిపారు. శుక్రవారం కోసువారిపల్లె సబ్ సెంటర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో రక్తహీనతపై అవగాహన సదస్సులు నిర్వహించారు. రక్తహీనత నివారణకు అందరూ సహకరించాలని కోరారు. పాలు, పండ్లు, గుడ్లు, కాయగూరలుతో పాటు డ్రైఫ్రూట్స్, ఎండు ద్రాక్ష తీసుకోవడం మంచిదన్నారు. ఐరన్ మాత్రలు, ఫోలిక్‌యాసిడ్ మాత్రలను పింపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సు సర్వీస్

పీలేరు రూరల్ : పౌర్ణమిని పురస్కరించుకుని తిరువణ్ణామలైకు పీలేరు నుంచి ప్రత్యేక బస్సు సర్వీస్ బయలుదేరి వెళ్లింది. శుక్రవారం ఉదయం డీఎం కుమార్ ప్రత్యేక పూజలు చేసి జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులో మొత్తం 50 మంది భక్తులు వెళ్లినట్లు తెలిపారు. మార్గం మధ్యలో కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్ దర్శనం కూడా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సీఐ ధనుంజయులు, ఎస్టీఐ సుధాకర్ నాయక్, బస్‌స్టేషన్ మేనేజర్ రెడ్డెప్ప, గ్యారేజీ ఎంఎఫ్ హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తలపై దాడి

బి.కొత్తకోట: పోలంలో ఆవులు మేశాయని ప్రశ్నించిన రైతుపై దాడిచేసి కొట్టగా, ఎందుకు కొట్టావంటూ నిలదీసిన రైతు భార్యపైన దాడి చేసి గాయపరచిన సంఘటనపై కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ రవినాయక్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు.. గోళ్లపల్లె పంచాయతీ దిన్నెమీదపల్లెకు చెందిన రైతు ఆర్.నారాయణరెడ్డి మొక్కజొన్న పోలంలో హరి అనే వ్యక్తి తన ఆవులను పోలంలోకి తోలి మేపాడు. దీనిపై నారాయణరెడ్డి ప్రశ్నించగా హరి కట్టెలతో దాడిచేసి కొట్టడంతో తలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకొన్న నారాయణరెడ్డి భార్య రామసుబ్బమ్మ మా పోలంలో పంటను మేపి ప్రశ్నించిన మమ్మల్నే కొడతావా అని హరిని నిలదీయగా ఆమెపైనా దాడిచేసి కట్టెలతో కొట్టడంతో గాయపడింది. దీనిపై బాధితుడు నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

ఇందిరమ్మ కాలనీలో సర్వే


సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

గుర్రంకొండ: గుర్రంకొండలోని ఇందిరమ్మ కాలనీలో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. కాలనీ ఇంతవరకు ఇళ్లు నిర్మించుకోని ఖాళీ స్థలాల వివరాలను సేకరించారు. శుక్రవారం ఆర్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలోని వీఆర్వో, ఇతర అధికారులను నాలుగు బృందాలు గా విభజించి ముమ్మరంగా సర్వే నిర్వహించారు. మొత్తం 642 ఇళ్లు ఉన్న కాలనీలో ఇప్పటివరకు ఇళ్లు నిర్మించుకోని వారి వివరాలు, 12 సంవత్సరాలుగా పునాదులు నిర్మించుకోనివారు, అసలు ఇంతవరకు పునాదులే వేయకుండా ఖాళీగా ఉన్న స్థలాల వివరాలను సేకరించారు. పూర్తి వివరాలతో కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నట్లు వారు పేర్కొన్నారు.

8న విశ్రాంత ఉద్యోగుల ఎన్నికలు

మదనపల్లె సిటీ: ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల మదనపల్లెశాఖ ఎన్నికలు 8న నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధ్యక్షుడు బీటీ నరసింహులు తెలిపారు. స్థానిక ఎన్జీవో హోంలో ఉదయం 10 గంటలకు జరిగే ఎన్నికలకు సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

జిల్లా ఆస్పత్రిలో ముగిసిన తనిఖీలు


జిల్లా ఆస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న కేంద్ర బృందం

మదనపల్లె: మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ బృందం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న తనిఖీలు శుక్రవారం ముగిశాయి. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ బృందం సభ్యులు డాక్టర్ అమిత, సెంథిల్‌కుమార్, అబ్దుల్‌రహమాన్, రాష్ట్రం నుంచి జ్యోతిరెడ్డి, జిల్లా నుంచి ప్రభావతి బృందంగా ఉమ్మడి తనిఖీలను పూర్తి చేశారు. తనిఖీ వివరాలను నివేదిక రూపంలో కేంద్రవైద్య ఆరోగ్యశాఖకు అందజేస్తామన్నారు. తనిఖీల వివరాలను వెల్లడించేందుకు నిరాకరించారు. ఆస్పత్రిలో అందించే వైద్య సేవలు అందుబాటులో ఉన్న వసతులు,ఆస్పత్రి సౌకర్యాలపై రోగుల స్పందన, ఆస్పత్రి రికార్డుల నిర్వహణ, ఆస్పత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో పాటు అన్ని విభాగాలను క్షుణంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, అధ్యాయనం చేసినట్లు చెప్పారు. తాము సూచించిన విషయాలను ఆస్పత్రి వైద్యులు పాటిస్తున్నారని తెలిపారు. నివేదికల ఆధారంగా కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ఆస్పత్రి నాణ్యత ప్రమాణాలపై గ్రేడ్‌లను కేటాయిస్తుందన్నారు. ఆ మేరకు ఆస్పత్రులకు నిధులు మంజూరు చేస్తారన్నారు. తనిఖీల అనంతరం ఆస్పతి వైద్యులతో తగిన సూచనలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆంజనేయులు, ఆర్‌ఎంఓ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండపై అభివృద్ధి పనులు భేష్


కొండపై వ్యూ పాయింట్ పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై జరుగుతున్న అభివృద్ధి పనులు భేష్ అని టూరిజంశాఖ చీఫ్‌ఇంజినీర్ శంకరయ్య అన్నారు. శుక్రవారం ఆయన మల్లయ్యకొండను సందర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ కెఆర్ మల్లిరెడ్డి,పూజారి ఈశ్వరప్ప స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కొండపై జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. ప్రముఖ దర్శనీయ స్థలాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. టూరిజంశాఖ ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యంగా పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పర్యాటక శాఖ అడ్వైజరీ కమిటీ సభ్యులు శేఖర్ బాబు , పీఆర్‌డీఈ విజయమోహన్, ధర్మకర్త వి.ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

న్యాక్ పీర్ కమిటీ పరిశీలన



మాట్లాడుతున్న న్యాక్‌పీర్ కమిటీ చైర్మన్ డాక్టర్ మణియన్ సెల్వముత్తు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలో నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కమిటీ (న్యాక్ పీర్ కమిటీ) పలు అంశాలపై పరిశీలన జరిపారు. శుక్రవారం న్యాక్‌పీర్ కమిటీ చైర్మన్, అన్నామలై యూనివర్సిటీ రిటైర్డు వైస్ చాన్సలర్ డాక్టర్ మణియన్ సెల్వముత్తు, మెంబర్ కోఆర్డినేటర్ హర్యానా రాష్ట్రం గురుజంబేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఉషా అరోరా, మెంబర్ శ్రీనగర్ రాష్ట్రం పుల్వామా ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ ముస్తాబ్ అలిమీర్‌తో కూడిన త్రిసభ్య కమిటీ కళాశాలలో పలు అంశాలపై పరిశీలించారు. ఈ సందర్భంగా కాలేజీలో విద్యార్థుల సంఖ్య, ఉత్తీర్ణత శాతం, ల్యాబ్ సౌకర్యం, అధ్యాపకుల క్వాలిఫికేషన్, రికార్డులు, విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌లు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో అవార్డులు తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, ఐక్యూఈఎస్ కో ఆర్డినేటర్ రమ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు : అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక 2, 3వ గ్రామ సచివాలయాలకు సంబంధించి స్థానిక కడప మార్గంలోని గోపీ ఫంక్షన్ హాల్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. హౌసింగ్ లబ్ధిదారులు ఉపాధి జాబ్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీంతో రూ. 23,100 లబ్ధిదారుల ఖాతాకు జమ అవుతుందని తెలిపారు. అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై ప్రతి ఇంటికి వెళ్లి వివరించి ప్రజల్లో చైతన్యం నింపాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని గర్భిణులు, బాలింతలకు పారదర్శకంగా అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు డాక్టర్ హబీబ్‌బాషా, దండు జగన్‌మోహన్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షఫీ, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కడప గిరిధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు ఎస్.వి. చలపతి, హరిత, ఎంపీటీసీలు లావణ్య, నరసింహారెడ్డి, నాయకులు మహితాఆనంద్, ఉదయ్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, ఉమాకాంత్ రెడ్డి, హబీబ్, తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండ జెడ్పీహైస్కూల్ హెడ్మాస్టర్ మృతి

గుర్రంకొండ: స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్ హెడ్మాస్టర్ ఎ. శివయ్య(56) మృతి చెందాడు. పెద్ద మండ్యం మండలం శివపురం పంచాయతీ గొల్లపల్లెకు చెందిన శివయ్య నాలుగేళ్లుగా జెడ్పీహైస్కూల్లో హెడ్మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం హఠాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో తిరుపతికి తీసుకెళుతుండాగ మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని వారి స్వగ్రామమైన గొల్లపల్లెకు తీసుకెళ్లారు. శనివారం ఆయన మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు.